సాక్షి నిర్మల్

గురువారం : 20 : మార్చి : 2025



అలరించిన వీడ్కోలు వేడుకలు

జిల్లాలోని పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు హంగామా చేశారు. IIIలో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:23	శుక్ర : 5:04

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం ఉదయం మేఘావృతమవుతుంది. చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

‘మధ్యాహ్న’ కార్మికుల నిరసన



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవో, డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు గత డిసెంబర్ నుంచి పెరిగిన మెనూ చార్జీ రూ.74 పైసలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధ, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు రాజేశ్వర్, మంజుల, పద్మ, గోదావరి, మాయవ్వ, సరస్వతి, లక్ష్మీబాయి, హంస పాల్గొన్నారు.

ఏరియాస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



బృందం సభ్యులతో కాశీనాథ్, సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిని కాయకల్ప బృందం బుధవారం సందర్శించింది. బృందం సభ్యుడు డాక్టర్ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్య నిర్వహణ, క్లినికల్ వేస్టేజ్, గడువు ముగిసిన మందుల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, నర్సింగ్ ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. రోగులకు మెరుగైన సేవలందించడంలో పోటీ పడేందుకు కాయకల్ప ర్యాంక్‌లు ఇస్తుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి నివేదిక పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాయకల్ప బృందం సభ్యులు హెడ్‌నర్స్ సుజాత, ఫార్మసిస్ట్ శ్రీలత, మాణిక్యం, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్లు చంద్ర సుజాత, రేఖ, హెడ్‌నర్స్ విజయశ్రీ, స్టాఫ్ నర్స్ మంజూష తదితరులున్నారు.

ఎంపిక జాబితా విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాల భర్తీకి గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ 03/2023 తేదీ: 10.08.2023కు సంబంధించి మెరిట్, రిజెక్ట్, సెలక్షన్ లిస్ట్ www. nirmal. telangana. gov. in పోర్టల్‌తోపాటు జిల్లా వైద్యాధికారి కార్యాలయం (ఐడీవోసీ)- 25లో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ఆయుష్ (పురుషులు, స్త్రీలు), ఫార్మసిస్ట్, ఉద్యోగాల భర్తీ కోసం వెలువడిన నోటిఫికేషన్ 02/2024 తేదీ: 29.02.2024కు సంబంధించిన ఎంపీహెచ్ఏ (స్త్రీలు), రిఫ్రిజిరేటర్ మెకానిక్, డీఈవో కం అకౌంటెంట్ ఉద్యోగాలకు సంబంధించిన జాబితా పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యకేంద్రాలకు సర్టిఫికెట్లు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు లభించినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో తెలిపారు. సారంగపూర్ మండలం చించోలి (బీ), లక్ష్మణచాంద మండలం మల్లాపూర్, ముధోల్ మండలం తరోడ, బాసర మండలం కౌట ఆరోగ్యకేంద్రాలకు సర్టిఫికెట్లు లభించినట్లు పేర్కొన్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి బృందం అన్ని ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలను సందర్శించి పలు నాణ్యత ప్రమాణాలను బేరీజు వేసి ఫలితాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్నికేంద్రాలు మెరుగైన పనితీరు కనబరిచి భవిష్యత్‌లో మరిన్ని ప్రోత్సాహకాలు, అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

‘ప్రణాళికతోనే విజయం’

నిర్మల్ టౌన్: క్రమశిక్షణ, ప్రణాళికతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ‘కెరియర్‌లో విజయం ఎలా సాధించాలి’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అకాడమిక్ పుస్తకాలు చదివితే ప్రయోజనం ఉంటుందని, లక్ష్యం, ప్రణాళిక, ప్రయత్నం, పట్టుదల తప్పనిసరి అని చెప్పారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, సమన్వయకర్తలు రమేశ్, అర్చన, సూర్యసాగర్, హేమలత, సుభాష్, శ్రీహరి, రజిత, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశనిరాశల పద్దు



- పథకాలకే ప్రథమ ప్రాధాన్యత
- జిల్లాకు దక్కని ప్రయోజనం
- బాసర గోదావరికి ‘హారతి’
- మహిళలు, రైతులకు ఊరట
- బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

ఈసారి కూడా రాష్ట్రబడ్జెట్ ఉసూరుమనిపించింది. రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలు, రెగ్యులర్ కేటాయింపులు మినహా పెద్దగా ఎలాంటి ప్రత్యేకతలు కనిపించలేదు. యథావిధిగా ప్రాజెక్ట్‌లు, కాలువల మరమ్మతుకు ఎంతోకొంత ఇవ్వాలన్నట్లు ఈపద్దులో కేటాయింపులు మినహా పెద్దగా నిధులివ్వలేదు. బాసర ఆలయ అభివృద్ధికి కొత్తగా ఎలాంటి కేటాయింపులు చేయకపోవడంతో పాటు గతంలో తీసుకున్న రూ.42కోట్లపైనా ఎలాంటి ప్రకటన చేయలేదు. బాసరలో గోదావరి హారతి చేపడతామని మాత్రం ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీలు ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని, జిల్లాకు ఎలాంటి ప్రయోజనం కల్పించలేదని ఆరోపణలు చేస్తుండగా, అధికారపక్షం మాత్రం ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని, గతం కంటే ఎక్కువ కేటాయింపులు చేశారని సమర్థిస్తున్నారు. – నిర్మల్

ఈసారి కూడా పాతలెక్కనే..

ఈసారి రాష్ట్ర పద్దులో పెద్దగా జిల్లాకు కేటాయింపులు లేవు. ఎప్పటిలాగే సాగునీటి ప్రాజెక్ట్‌ల మరమ్మతు, నిర్వహణ కోసం అరకొరగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సారెస్పీ–1కింద పేర్కొనే కడెం ప్రాజెక్టుకు రూ.3కోట్ల లక్షాయాభైవేలు, సుద్దవాగు ప్రాజెక్టుకు రూ.3.42కోట్లు, స్వర్ణ ప్రాజెక్టుకు రూ.70లక్షలు కేటాయించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులున్నా.. అందులో జిల్లాలోని 27, 28 ప్యాకేజీలకు ఎంత బడ్జెట్ కేటాయిస్తారనే లెక్క తేల్చలేదు. ఏళ్లు గడిచిపోతున్నా.. పక్కనే ఉన్న గోదావరి జలాలు మాత్రం జిల్లాలోని భూములకు అందని పరిస్థితి ఉండగా పెద్దగా పట్టించుకోలేదు.

బాసరలో ‘హారతి’స్తారట..

జిల్లాలోనే కాదు.. దక్షిణ భారతంలోనే ప్రముఖ సరస్వతీక్షేత్రం బాసర. ఇక్కడి ఆలయ అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ ఉంటే గత ప్రభుత్వం రూ.50కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.8కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇక ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగతా రూ.42కోట్లు వెనక్కి తీసుకుంది. ఈ నిధులను తిరిగి ఆలయానికి ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే రామారావుపటేల్ అసెంబ్లీ సాక్షిగా అడిగినా కేటాయించలేదు. ప్రభుత్వం తరఫున గంగాహారతి తరహాలో బాసరలో గోదావరికి హారతినిచ్చే కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు.

మహిళలు, రైతులకు..

మెగామాస్టర్‌ప్లాన్ 2050 పేరిట అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తామని ఆర్థికశాఖమంత్రి ప్రకటించారు. ప్రతీ మండలంలో మహిళలతో రైస్‌మిల్లులు, మినీగోదాములు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళల రైస్‌మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తామన్నారు. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తామని ప్రకటించారు. మండల మహిళా సమాఖ్య ద్వారా ఆర్టీసీకి 600 బస్సులు అద్దెకిస్తామని పేర్కొన్నారు. వీటిద్వారా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులూ లబ్ధి పొందనున్నారు. రైతుభరోసాకు నిధుల కేటాయింపులతో పాటు సాగుకు రూ.24,439కోట్లు కేటాయించారు. విద్యారంగానికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయని, పరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహం లేదని సంబంధిత రంగాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజలను వంచించే బడ్జెట్



ఇచ్చిన ఆరు గ్యారంటీలను కూడా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌తో ప్రజలను మరింత మోసం చేసింది. బడ్జెట్ నిండా బడాయి, అప్పులు మినహా ప్రజాసంక్షేమం ఎక్కడా లేదు. జిల్లాకు ఎలాంటి కేటాయింపులు లేవు. అభివృద్ధికి నిధులూ ఇవ్వలేదు.

– మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నిర్మల్

బడ్జెట్‌లో ఏమీ లేదు



రాష్ట్రబడ్జెట్‌లో కోట్లలో కేటాయింపులు మినహా.. చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. ప్రజలను వంచించే బడ్జెట్ ఇది. బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి సంబంధించిన రూ.42కోట్ల నిధులు వెనక్కి ఇవ్వలేదు. చెరువులనూ పట్టించుకోలేదు.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

ఆమోదయోగ్య బడ్జెట్



ప్రజల సంక్షేమం కోసం ఈసారి బడ్జెట్‌లో గతం కంటే ఎక్కువ కేటాయింపులు చేపట్టాం. ఇది ప్రజామోదయోగ్యమైన పద్దు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

సీపీఎస్ ప్రస్తావనే లేదు



పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించి, మేనిఫెస్టోలో పెట్టారు. ఈ బడ్జెట్‌లో సీపీఎస్ రద్దు చేస్తారని ఆశించాం. కానీ.. బడ్జెట్‌లో దాని ప్రస్తావనే తీసుకురాకపోవడం శోచనీయం.

– కృష్ణారావు, పెన్షన్ ఉద్యమ నాయకుడు

విద్యాభివృద్ధికి తక్కువే..



బడ్జెట్‌లో విద్యాభివృద్ధికి కేటాయింపులు చాలా తక్కువగానే ఉన్నాయి. విద్యాశాఖకు గతేడాది కంటే కేటాయింపులు తగ్గాయి. రెసిడెన్షియల్స్, యంగ్ ఇండియా స్కూళ్లు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులకు కేటాయింపులు ఏమాత్రం సరిపోవు.

– భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

అంకెల గారడీతో మోసం



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బడ్జెట్‌లో అంకెల గారడీతో మోసం చేశారు. ప్రతీరంగానికి మొండిచేయి చూపించారు. లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని పాలకులు మరింత అప్పుల ఊబిలోకి తీసుకెళ్తున్నారు.

– రావుల రాంనాథ్, బీజేపీ సీనియర్‌నేత

‘పది’ ఫలితాల్లో హ్యాట్రిక్ కొడతాం

- మూడోసారి కూడా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలుస్తాం
- జిల్లా విద్యాధికారి రామారావు



రామారావు, జిల్లా విద్యాధికారి

నిర్మల్ రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈసారి కూడా రాష్ట్ర స్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతామని జిల్లా విద్యాధికారి (డీఈవో) రామారావు ధీమా వ్యక్తంజేశారు. ఈనెల 21నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయనను ‘సాక్షి’ ఇంటర్వ్యూ చేయగా ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు? జిల్లా వ్యాప్తంగా ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డీఈవో: జిల్లాలో మొత్తం 9,129 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో బాలికలు 4,685, బాలురు 4,444 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 47 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో నిర్మల్‌లో 22, భైంసాలో 19, ఖానాపూర్‌లో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షణాధికారి, సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించాం. అన్ని కేంద్రాల్లో 523 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు.

సాక్షి: ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

డీఈవో: విద్యార్థులకు రెండు గ్రాండ్ టెస్టులు నిర్వహించాం. ప్రీ ఫైనల్ పరీక్షలు కూడా పూర్తి చేశాం. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాం. వీరిని ఉపాధ్యాయులు దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాం. ఉదయం, సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు నిర్వహించాం. మా కృషి ఫలితంగా ఈసారి కూడా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధిస్తాం.

సాక్షి: ఉష్ణోగ్రతలు పెరిగినందున కేంద్రాల వద్ద కల్పిస్తున్న వసతులేమిటి?

డీఈవో: ఎండల తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద చల్లని తాగునీరు అందుబాటులో ఉంచేలా చూస్తాం. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వసతులూ కల్పిస్తున్నాం.

సాక్షి: ఈసారి పరీక్షా విధానంలో బోర్డు చేసిన మార్పుల గురించి తెలుపండి?

డీఈవో: పరీక్షా ఫలితాల్లో గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి మునుపటిలా మార్కులు ప్రకటించనున్నారు. విద్యార్థులకు ఈసారి సింగిల్ రూల్స్‌గల 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ఇందులోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. అదనపు సమాధాన పత్రం ఇవ్వరు. గతంలో బయోలజీ, ఫిజికల్ సైన్స్ పరీక్షలు ఒకేరోజు నిర్వహించగా ఈసారి వేర్వేరుగా రెండు రోజులు నిర్వహిస్తారు.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సూచనలు?

డీఈవో: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఐదు నిమిషాలు వెసులుబాటు కల్పిస్తాం. హాల్‌టికెట్ అందనివారు వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- మున్సిపల్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: మున్సిపాలిటీల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులు సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా కేటాయించిన నిధులు, చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులు, అందుబాటులో ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలు పార్కులకు వచ్చేలా చూడాలని తెలిపారు. గేట్లు, గోడలకు రంగులు వేసి, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పట్టణవాసులను భాగస్వాములను చేస్తూ పార్కులకు అసోసియేషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్‌కృష్ణ, రాజేశ్‌కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించిన ఆశ కార్యకర్తలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- అదనపు కలెక్టర్ హామీతో విరమణ

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఉదయం 9గంటలకే గేటు ఎదుట బైఠాయించి సుమారు 3గంటలపాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌వో, స్థానిక సీఐ పలుసార్లు సముదాయించినా వినలేదు. దీంతో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రోడ్డుపై, చెట్ల నీడన నిరీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వోతో మాట్లాడి పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు రిలీజ్ చేయించారు. మూడేళ్లకు సంబంధించిన సర్వే డబ్బులు గురువారం అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగతా సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగామణి, సుజాత, చంద్రకళ, రామలక్ష్మి, విజయలక్ష్మి, మంగమ్మ, అనురాధ, శారద, లావణ్య, స్రవంతి, సౌమ్య, సరిత, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పెద్దలసభలో ‘పెద్ద’గా నిర్మల్ బిడ్డ



నిరంజన్‌రెడ్డి

నిర్మల్: రాజ్యసభలోకి అడుగుపెట్టి తొలి గుర్తింపు దక్కించుకున్న నిర్మల్‌బిడ్డ సిర్గాపూర్ నిరంజన్‌రెడ్డి. అదే పెద్దలసభకు ‘పెద్ద’గా వ్యవహరించి జిల్లాపేరు దేశవ్యాప్తంగా చర్చించుకునేలా చేశారు. దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌కు చెందిన నిరంజన్‌రెడ్డి దేశంలోనే ప్రముఖ న్యాయవాదిగా పేరొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. రాజ్యసభలో ప్యానెల్ డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న నిరంజన్‌రెడ్డి మంగళవారం జరిగిన సమావేశాల్లో తన బాధ్యతలను నిర్వర్తించారు. పెద్దల సభగా గుర్తింపు పొందిన రాజ్యసభకు ‘పెద్ద’గా తాను వ్యవహరించిన తీరును అందరూ ప్రశంసించారు. జిల్లావాసికి అరుదైన గుర్తింపు దక్కడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అనాసక్తి

- 25శాతం రిబేట్ కల్పించిన సర్కారు
- చెల్లింపునకు ఈ నెల 31వరకు గడువు
- ముందుకురాని దరఖాస్తుదారులు
- హెల్ప్‌డెస్క్‌లకు స్పందన కరువు



హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. అధికారులు దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినా మొహం చాటేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లోనే కాకుండా మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి ఎస్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలు ఉండటంతో ముందుకు రావడం లేదని సమాచారం. దీంతో మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా మ్యాపింగ్ ఇస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 44,436 దరఖాస్తులు రాగా.. వీటిని మూడు దశల్లో పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వాటికి అనుమతి ఇవ్వనున్నారు.

మూడు మున్సిపాలిటీల పరిధిలో..

జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 44,436 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఫీజు చెల్లింపునకు 24,576 దరఖాస్తులు సరైనవిగా అధికారులు గుర్తించారు. ఈ నెల 16వరకు 239 మంది దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించగా ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.68.02 లక్షల ఆదాయం సమకూరింది. ఇంకా 24,337 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాల్సి ఉంది.

బల్దియాల వారీగా ఇలా..

ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 1,928 దరఖాస్తులు రాగా, 1,348 దరఖాస్తులను ఫీజు చెల్లింపునకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 15మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా ఇంకా 1,333 మంది చెల్లించాల్సి ఉంది. నిర్మల్ బల్దియా పరిధిలో 15,515 దరఖాస్తులు రాగా, 10,264 దరఖాస్తులు సరైనవిగా గుర్తించారు. ఇందులో 115 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా ఇంకా 10,161 మంది దరఖాస్తుదారులు చెల్లించాల్సి ఉంది. భైంసా మున్సిపల్ పరిధిలో 9,044 దరఖాస్తులు రాగా, 6,289 దరఖాస్తులను సరైనవిగా గుర్తించారు. ఇందులో 48 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా ఇంకా 6,241 మంది దరఖాస్తుదారులు చెల్లించాల్సి ఉంది.

వేటికి ఎల్‌ఆర్‌ఎస్ వర్తించదంటే..

మున్సిపల్ పరిధిలో బఫర్, ఎఫ్టీఎల్, కుంటలు, చెరువులు, ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలోని భూములకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తించదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ వీటి పరిధిలో భూములుంటే గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నా క్రమబద్ధీకరణ చేయకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్‌కు పూర్తి ఫీజు చెల్లించినా క్షేత్రస్థాయి విచారణ అనంతరం తిరస్కరణకు గురైతే చెల్లించిన ఫీజులో 10శాతం మినహాయించుకుని 90 శాతం డబ్బులు తిరిగి దరఖాస్తుదారుకు చెల్లిస్తారు.


మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్క్‌లు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. బల్దియాల పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. దరఖాస్తుదారులు సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చు.

క్షేత్రస్థాయి పరిశీలన ఇలా..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను అధికారులు మొదటి దశలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ముందుగా సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పరిశీలిస్తారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా పరిశీలన చేపడతారు. సర్వే నంబర్ల వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం లేదా మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటి పారుదలశాఖ అసిస్టెంట్ ఇంజినీర్లతో కూడిన బృందం పరిశీలిస్తోంది. ఈ బృందం జీపీఎస్ ద్వారా సదరు భూమి హద్దులు, ఇతర సమాచారాన్ని మొబైల్ యాప్‌లో నమోదు చేస్తోంది. ఇదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, డిఫెన్స్ ల్యాండ్ పరిధి లోనివి కావని ధ్రువీకరించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 31లోపు ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుంది. ఒకవేళ 31వ తేదీ దాటితే ప్రస్తుతమున్న రిజిస్ట్రేషన్ విలువకు అనుగుణంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు గడువులోపు చెల్లించి రాయితీ వినియోగించుకోవాలి.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

క్లుప్తంగా

రేషన్‌బియ్యం పట్టివేత

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో ఉన్న రేషన్ దుకాణంలో బుధవారం సదరు డీలర్ బియ్యం విక్రయిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. డీలర్ కిష్టయ్య మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి 20 క్వింటాళ్ల బియ్యం విక్రయించగా వాటిని ఐచర్ వాహనంలో లోడ్‌చేస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బెల్లం, పటిక స్వాధీనం

కడెం: మండలంలోని లక్ష్మీపూర్‌లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాడేటి సత్యగౌడ్ ఇంటి పరిసరాల్లో దాచి ఉంచిన 120 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి సత్యగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిషేకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్, హరీశ్, సాయి, రాజేందర్, కల్పన పాల్గొన్నారు.

నాయకపుగూడలో గంజాయి..

తిర్యాణి: మండలంలోని నాయకపుగూడలో గంజాయి పట్టుకున్నట్లు రెబ్బెన సీఐ బుద్దే స్వామి, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం పోలీసు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా గ్రామంలోని చిన్నయ్య ఇంట్లో తనిఖీ చేయగా 875 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహిళపై దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ బుధవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. 2015లో కర్ణమామిడికి చెందిన బొడ్డు పద్మపై అదే గ్రామానికి చెందిన బొడ్డు సత్తయ్య, బొడ్డు బాపయ్య దాడి చేయడంతో హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ కేసు పూర్వాపరాలు పరిశీలించి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి రెండేళ్ల జైలు

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మాసం రాజేశ్వర్ గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేయడంతో పాటు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. బైండోవర్ ఉల్లఘించి తిరిగి మద్యం విక్రయిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ సుజాత రెండేళ్ల జైలు శిక్ష కోసం రిమాండ్‌కు తరలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు వద్ద మట్కా నిర్వాహకుడు టేకాం దత్తును అరెస్టు చేసినట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. బుధవారం ఎస్సై దివ్యభారతితో పాటు సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకుని మట్కా చిటీలతో పాటు రూ.7,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని కోర్పణ కేంద్రంగా బాలు అనే వ్యక్తితో మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు.

వన్యప్రాణులకు సహజ జలం

- ప్రతీ కిలోమీటర్‌కు ఒక నీటివనరు ఏర్పాటు
- సోలార్ పంపుల ద్వారా తాగునీటిని అందించే యత్నం
- చెలిమెలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పీటీలు, నీటికుంటలకు ప్రాధాన్యం



ఇందన్‌పల్లి రేంజ్‌లో సోలార్ పంపుద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న రేంజ్ అధికారి

జన్నారం: అడవిలో నివసించే వన్యప్రాణులకు వేసవిలో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందువల్ల అటవీశాఖ ముందస్తుగానే అప్రమత్తమైంది. అడవిలో ఉన్న నీటి వనరులను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సహజసిద్ధమైన నీటితో సహా సోలార్ పంపుల ద్వారా నీటిని అందించేందుకు ప్రయత్నిస్తోంది. మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు అటవీ రేంజ్‌లు, 40 అటవీ బీట్‌లలో నీటిఎద్దడి నివారణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈక్రమంలో అడవిలోని వాగులు, ఊటనీటిని సహజ సిద్ధంగా నీటిఎద్దడి ప్రాంతాల్లో సోలార్ పంపుల ద్వారా నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. చెలిమెలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పీటీలు, నీటికుంటలతో పాటుగా ఊట నీటిని వన్యప్రాణులకు అందించేలా ఏర్పాట్లు చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు అటవీ రేంజ్‌లలో ఐదు చోట్ల సహజ నీటి వనరులు, 187 కుంటలు, 29 సోలార్ పంపులు, 30 ర్యాంప్‌వెల్స్ ద్వారా నీటిసౌకర్యం కల్పిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

సహజ సిద్ధమైన జలానికే ప్రాధాన్యత

గతంలో సాసర్ వెల్‌లో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు అందించేవారు. ప్రస్తుతం ఈ పద్ధతికి స్వస్తి పలికారు. వాగునీరు, జలధారలతో పాటు నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులతో నీటిని అందించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. జన్నారం డివిజన్‌లోని మూడు అటవీ రేంజ్‌లలో ప్రతీ కిలోమీటర్ దూరంలో ఒక రకమైన నీటివనరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

వాగుల్లో చెలిమెలు

మధ్యప్రదేశ్‌లోని కన్హా టైగర్ జోన్ మాదిరిగా కవ్వాల్ టైగర్‌జోన్‌లో వాగులకు ఆనకట్టలు వేసి సహజ సిద్ధమైన నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రవహించే వాగునీటికి ఆనకట్టలు వేసి నీటిని ఆపుతున్నారు. జన్నారం డివిజన్‌లో గతేడాది 30 చోట్ల ఇలాంటి ఆనకట్టలు వేయగా ఈ ఏడాది వాటి సంఖ్య పెంచనున్నారు. వాగునీటికి అడ్డంగా బండ రాళ్లు, ఇసుకతో కట్టకట్టడంతో నీరు నిలిచి చెలిమెలా తయారవుతుంది. పారేనీరు శుభ్రంగా ఉండడంతో వాటిని వన్యప్రాణులు ఇష్టపడుతాయి.

నీటికుంటలు

అడవిలో భూగర్భ జలాలను పెంచేందుకు వర్షపునీరు వృథాగా పోకుండా నిర్మించిన నీటికుంటలపై అధికారులు దృష్టి పెట్టారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో 300 వరకు నీటి కుంటలు ఉండగా అందులో 187కు కుంటల్లో ప్రస్తుతం నీరు ఉంది. ఏప్రిల్, మే వరకు 100 కుంటల్లో నీరు ఉండే అవకాశంఉందనిఅధికారులు చెబుతున్నారు.

సాసర్ వెల్ ద్వారా నీటి సౌకర్యం

నీటికుంటలు, సోలార్ పంపులు, ర్యాంప్‌వెల్స్ లేని ప్రదేశాల్లో, ఎత్తయిన ప్రాంతంలో సాసర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతారు. ఆ శబ్దానికి వన్యప్రాణులు పారిపోయే అవకాశం ఉండడంతో వాటి సంఖ్య తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సహజ సిద్ధంగా నీటిని అందిస్తున్నారు. ఒకవేళ నీటికొరత ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా నీటిని నింపనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నాం



అడవిలో నివసించే వన్యప్రాణులకు ఆహారంతో పాటు నీటిసౌకర్యం కల్పించేందుకు పలురకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోలార్ పంపులతో కుంటల్లోకి నీటిని వదులుతున్నాం. వన్యప్రాణులకు స్వచ్ఛమైన నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నాం.

– కారం శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

సోలార్ పంపులు



తాళ్లపేట రేంజ్‌లోని సోలార్ పంపు

జన్నారం అటవీ డివిజన్‌లో గతేడాది 18 సోలార్ పంపుల ద్వారా కుంటల్లోకి నీటిని వదిలిపెట్టగా ఈ ఏడాది వాటి సంఖ్య 29కి పెంచారు. వేసవిలో ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉన్నందువల్ల సోలార్ పంపుల ద్వారా అందులోకి నీటిని వదులుతున్నారు.

ర్యాంప్‌వెల్స్



జన్నారం రేంజ్‌లోని ర్యాంప్‌వెల్

నీటి ఊటలు ఉన్న ప్రదేశంలో మూడు మీటర్ల లోతు, పది మీటర్ల వెడల్పుతో గుంతను తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊరగానే వన్యప్రాణులు సులువుగా అందులోకి దిగి నీరు తాగే విధంగా రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేస్తారు. గతేడాది 25 వరకు, ఈ ఏడాది 30 చోట్ల ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు వాటిని రెండు రోజులకోసారి పర్యవేక్షిస్తారు.

ఉద్యాన నర్సరీ రైతులకు వరంలాంటిది



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఉద్యాన నర్సరీ రైతులకు వరం లాంటిదని జిల్లా ఉద్యాన అధికారి, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సుధాకర్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఉద్యాన నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో చేపడుతున్న వివిధ రకాల పనుల గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ వివరించారు. నర్సరీలో ఉన్న మామిడి, నిమ్మ, జామ, పుచ్చతోటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నీటికుంటలు, చెరువులను సైతం పరి శీ లించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి క్రాంతికుమార్, నర్సరీ సాంకేతిక అధికారి అర్పిత, సీపీఎఫ్ ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ రైసింగ్ డే



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రైసింగ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ టౌన్‌షిప్ నుంచి జైపూర్ మీదుగా పెగడపల్లి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సీఐఎస్ఎఫ్ పాత్ర, సీఐఎస్ఎఫ్ సహకారాన్ని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ పార్క్‌లో విద్యార్థికి పాముకాటు

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- గుట్టుచప్పుడు కాకుండా పార్క్ మూసివేసిన అధికారులు



మూసివేసిన కేసీఆర్ పార్క్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ పార్క్‌లో కాలక్షేపానికి ఆడుకునేందుకు వెళ్లిన విద్యార్థిని పాము కాటువేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూర్ పట్టణంలోని లైన్‌గడ్డ ప్రాంతానికి చెందిన సయ్యద్ సమీర్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15న శనివారం సాయంత్రం అతని స్నేహితులతో కలిసి పార్కులో ఆడుకుంటుండగా సమీర్‌ను పాము కాటు వేసింది. ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా ప్రాణాలతో బయటపడ్డాడు.

పార్క్ మూసివేత

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కనే ఉన్న కేసీఆర్ పార్క్‌లో పాములు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల చోటు చేసుకున్న ఘటన అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. విద్యార్థిని పాముకాటు వేసిన ఘటన వెలుగులోకి వస్తుందనే ఉద్దేశంతో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా పార్క్ మూసి వేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పార్కులో అంతర్గత పనుల నిర్వహణ కారణంగా మూసివేసినట్లు అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం గమనార్హం.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



రాజ్‌కుమార్ మృతదేహం

నెన్నెల: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మగ్గిడి రాజ్‌కుమార్(30)కు మంచిర్యాలకు చెందిన లావణ్యతో 2018లో వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. మద్యానికి బానిసైన రాజ్‌కుమార్ తరచూ ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. గొడవ జరిగినప్పుడల్లా భార్య పుట్టింటికి వెళ్లగా సర్దిచెప్పి ఇంటికి తీసుకువచ్చేవాడు. ఈ నెల 14న రాత్రి మద్యం సేవించిన రాజ్‌కుమార్ భార్యతో గొడవ పడటంతో పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యం మరింత ఎక్కువగా తాగుతుండేవాడు. భార్య రాదేమోనని బాధతో తాగిన మైకంలో మంగళవారం గడ్డి మందు తాగాడు. గమనించిన సోదరుడు ప్రసాద్ మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. మృతుని తల్లి బాలక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు



ఆటోలో లభించిన మద్యం సీసా



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

- ఆటోలో 6 మద్యం సీసాలు లభ్యం
- మద్యం మత్తే కారణమంటున్న బాధిత కుటుంబ సభ్యులు

బెజ్జూర్: ఆటో ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్న సిద్దాపూర్‌కు చెందిన రెసే సత్యబాయి బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో మండల కేంద్రానికి చెందిన గోరంట్ల రమేశ్ మద్యం మత్తులో ఆటో నడుపుతూ రోడ్డు దాటుతున్న సత్యబాయిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కాగజ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుమార్తె కొట్రంగి పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మద్యం మత్తే కారణం!

ఉదయం నుంచి మద్యం ఆటోలో పెట్టుకొని తాగుతూ జల్సాలు చేసినట్లు బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటన సమయంలో ఆటోలో 6 మద్యం సీసాలు, పల్లీలు, గ్లాసులు ఉన్నాయన్నారు. పెట్రోల్ బంక్ వద్ద ఆటోలో డెక్ పెట్టుకుని డ్యాన్సులు సైతం చేసినట్లు సమాచారం.

హైవేపై రోడ్డు ప్రమాదం

- లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై బస్టాండ్ సమీపంలో బుధవారం మూడు లారీలు ఢీకొన్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తు వెళ్తున్న కంటెనర్ లారీ రోడ్డుపై నిలిచి ఉండగా అతివేగంగా వచ్చిన లారీ సైడ్ తీసుకుంటూ అదుపుతప్పి కంటెనర్‌ను ఢీకొట్టింది. వెనుకనుంచి వచ్చిన మరోలారీ ఆ లారీని ఢీకొట్టడంతో డ్రైవర్ ప్రసాద్, క్లీనర్ అమేద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. కాగా ఈ నెల 8న ఇదే స్థలంలో రెండు లారీలు ఢీకొని ప్రమాదం చోటు చేసుకుంది. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గేట్ ఫలితాల్లో ప్రతిభ



శివకుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండకు చెందిన గూడెల్లి శివకుమార్ గేట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 32వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన పద్మ, శంకరయ్య దంపతుల కుమారుడు శివకుమార్‌కు ఈ నెల 16న అనూషాతో వివాహమైంది. సోదరి ప్రవళిక వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఎం-ఫార్మసీ, సోదరుడు ప్రశాంత్ ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఎంటెక్ పూర్తి చేసిన శివకుమార్ ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

అనుదీప్‌రెడ్డికి 65వ ర్యాంకు



అనుదీప్‌రెడ్డి

లోకేశ్వరం(ముధోల్): నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని హవర్గకు చెందిన అనుదీప్‌రెడ్డి బుధవారం వెలువడిన గేట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి–మనోహర్‌రెడ్డి దంపతుల కుమారుడు అనుదీప్‌రెడ్డి 100 మార్కులకు గానూ 71.33 మార్కులతో జాతీయస్థాయిలో 65వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ చదువుతున్నాడు. తల్లి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ కాగా తండ్రి మనోహర్ రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

అనుమానాస్పదంగా మత్స్యకారుడు మృతి



లింగయ్య (ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలకు చెందిన మత్స్యకారుడు మేడి లింగయ్య (65) చేపల వేటకు వెళ్లి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. లింగయ్య రోజు మాదిరిగానే బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు సమీప గోదావరినదికి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గోదావరి వద్దకు వెళ్లిచూడగా ఒడ్డు సమీపంలో పడిపోయి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

ముధోల్: ఈ నెల 18న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని ముద్గల్ గ్రామానికి చెందిన సిందె సాధన (33) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. గ్రామానికి చెందిన సిందె సాధన కొంతకాలంగా మానసిక స్థితి కోల్పోయింది. మంగళవారం ఇంట్లో ఉరేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి దిగంబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త దాసు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు లేదు

- టారీఫ్ పెంపుదల ప్రతిపాదించలేదు
- ప్రస్తుత ధరల్లో ఎటువంటి మార్పూ లేదు
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై స్పష్టత వచ్చింది. బుధవారం హనుమకొండలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన రిటైల్ సప్లయి వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ విచారణలో విద్యుత్ టారీఫ్‌ల ప్రతిపాదనలపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి టారీఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదన్నారు. ప్రస్తుత ధరల్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారీఫ్ విధింపు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసి ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్లు వినియోగించుకున్న వినియోగదారులకు ఎనర్జీ చార్జీల్లో 10శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపును కొనసాగిస్తున్నామని తెలిపారు. టీజీ ఎన్పీడీసీఎల్ నిర్వహణకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.19,814 కోట్ల ఆదాయ ఆవశ్యకత ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత టారిఫ్(టారిఫేతర ఆదాయం కలుపుకొని) రూ.9,421కోట్ల వస్తుందని అంచనా. దీంతో రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుంది.

ఐదు ఉద్యోగాలు సాధించిన సంకీర్తన



బొడ్డు సంకీర్తన

మంచిర్యాలటౌన్: చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తూ వరుసగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బొడ్డు సంకీర్తన. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బొడ్డు భీమయ్య, మల్లక్క దంపతులకు కుమారుడు సాయికిరణ్, కుమార్తె సంకీర్తన సంతానం. భీమయ్య హమాలి పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. పదోతరగతి మంచిర్యాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, డిగ్రీ కోటి ఉమెన్స్ కళాశాలలో చదివిన సంకీర్తన 2023లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. అందులో చేరకుండానే గ్రూప్–4 రాసి మంచిర్యాలలోని జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం సాధించింది. విధులు నిర్వహిస్తూనే మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన సీడీపీవో పరీక్షతో పాటు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్‌వైజర్) గ్రేడ్–1లో రెండు ఉద్యోగాలు సాధించింది. సీడీపీవో ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు, మల్టీజోన్ కేటగిరీలో 7వ ర్యాంకు సాధించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్‌వైజర్) గ్రేడ్ 1 మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఫలితాలను బుధవారం ప్రకటించగా, రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మల్టీజోన్‌లో 1వ ర్యాంకు సాధించింది.

అడవులు కాలితే పర్యావరణానికి నష్టం



అవగాహన కల్పిస్తున్న సురేశ్ కుమార్

చెన్నూర్‌రూరల్: అడవులు, ప్లాంటేషన్ కాలితే చిన్న చిన్న జీవరాశులు చనిపోవడమే కాకుండా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్ కుమార్ పేర్కొన్నారు. వేసవికాలంలో అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మండలంలోని పొన్నారం నీలగిరి ప్లాంటేషన్ సమీపంలోని చాకెపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, ప్లాంటేషన్ మీదుగా రాకపోకలు సాగించే వారు సిగరెట్, బీడీలు తాగి నిర్లక్ష్యంగా పడేయవద్దన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో పొలాలు ఉన్న వారు సాగు తర్వాత మిగిలిన గడ్డి, చెత్తను తగులబెట్టి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారన్నారు. దీంతో గాలులు వీచిన సమయంలో ఆ మంటలు అడవిలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ప్రమాదవశాత్తు అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగితే అధికారులకు సమాచారం అందించి అడవుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్ ఓదెలు, సంజీవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



దాంపూర్‌లో శంకుస్థాపనలో పాల్గొన్న పీడీ

భీమారం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని హౌసింగ్ కార్పొరేషన్ పీడీ బస్సీలాల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మోడల్ గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతలో ఇళ్లు మంజూరు చేస్తోందని అన్నారు. నిర్ణీత సమయంలో ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులను కోరారు. ఎంపీడీవో మధుసూదన్, హౌసింగ్ డీఈ మునేందర్, పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఆస్పత్రి భవనం కూల్చివేత

- పనులు ప్రారంభించిన సిబ్బంది
- విభాగాలన్నీ ఎంసీహెచ్‌లోకి తరలింపు
- రూ.51 కోట్లతో కొత్తభవన నిర్మాణం



కిటికీలు, ఇతర సామగ్రి తొలగిస్తున్న కూలీలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం కూల్చివేసి ఆ స్థలంలో రూ.57కోట్ల వ్యయంతో ఆధునిక వసతులతో కూడిన కొత్త భవనం నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేయడంతో కూల్చివేత పనులు బుధవారం ప్రారంభించారు. పాత భవనంలోని అన్ని విభాగాలను మాతాశిశు ఆస్పత్రిలోకి తరలించారు.

కూల్చివేత షురూ..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించేందుకు రూ.51 కోట్లు కేటాయించారు. ఈ నిధులు వెచ్చించి పనులు ప్రారంభించేందుకు వీలుగా పాత భవనం కూల్చివేస్తున్నారు. ఇప్పటికే కిటికీలు, తలుపులు, పార్టిషన్ల తొలగింపు పూర్తి కావొచ్చింది. సామగ్రి తొలగింపు పూర్తయ్యాక యంత్రాలతో భవనాన్ని నేలమట్టం చేసేలా కార్యాచరణ చేపట్టామని అధికారవర్గాలు తెలిపాయి.

డయాలసిస్ కేంద్రం తరలింపు

పాత భవనంలోని డయాలసిస్ కేంద్రం తరలింపు గందరగోళంగా ఉంది. ఐదు పడకలున్న డయాలసిస్ సెంటర్‌లో మూడుషిఫ్టుల్లో 15 మందికి సేవలందిస్తున్నారు. దీనిని కూడా మాతాశిశు ఆస్పత్రిలోని మొదటిఅంతస్తుకు మార్చాలని నిర్ణయించారు. డయాలసిస్ పేషంట్లు తాము మెట్లు ఎక్కి, దిగలేమని, కింది ఆవరణలోనే ఉండేలా చూడాలని అధికారులను కోరారు. ఈ వ్యవహారం వైద్యశాఖ ఉన్నతాధికారుల దాకా వెళ్లినట్లు సమాచారం. డయాలసిస్ సెంటర్ నిర్వహణకు అవసరమైన స్థలం కింద అందుబాటులో లేదని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సెకండ్ ఫ్లోర్‌లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మూడంతస్తుల్లో భవనం



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మూడంతస్తులతో కూడిన కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పాతభవనం కూల్చే పనులు మొదలయ్యాయి. డయాలసిస్ సెంటర్‌ను మాతా శిశు ఆస్పత్రిలోని సెకండ్ ఫ్లోర్‌కు తరలిస్తున్నాం. డయాలసిస్ కోసం వచ్చే 15 మంది పేషెంట్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, సూపరింటెండెంట్

క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న డీసీపీ కరుణాకర్

ఓదెల(పెద్దపల్లి): క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి ఉన్నతశిఖరాలు అధిరోహించాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సూచించారు. కనగర్తి, ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ, ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులవుతారన్నారు. సమాజంలో గౌరవంగా బతికేందుకు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలని అన్నారు. ఏసీపీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై రమేశ్, ఏఎస్సై సుధాకర్, ఎంఈవో రమేశ్, సైకాలజిస్ట్ అనిత పాల్గొన్నారు.

ఢిల్లీలో గళమెత్తిన ఎల్‌ఐసీ ఏజెంట్లు



ఢిల్లీ మహాధర్నాలో రామగుండం ఏజెంట్లు

కోల్‌సిటీ(రామగుండం): ఎల్‌ఐసీ పాలసీదారుల పాలసీలపై బోనసు పెంచడంతోపాటు పాలసీలపై రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో జరిగిన శాంతియుత మహాధర్నాలో పెద్దపల్లి జిల్లా రామగుండం ఎల్‌ఐసీ బ్రాంచ్ నుంచి 100 మంది ఏజెంట్లు పాల్గొని గళమెత్తారు. కేంద్రప్రభుత్వం ఐఆర్‌డీఏఐ, జీవిత బీమా మొండివైఖరికి నిరసనగా, ఆల్ ఇండియా ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సుమారు 2లక్షల మంది ఏజెంట్లతో శాంతియుత మహాధర్నా జరిగింది. సుమారు 100 మంది రామగుండం ఏజెంట్లు స్వచ్ఛందంగా ఢిల్లీ తరలివెళ్లి నిరసనలో పాల్గొన్నారు. పాలసీదారులకు పాలసీలపై బోనసు పెంచాలని, జీఎస్టీ రద్దు చేయాలని, మినిమం సమ్ అస్సూర్డ్ అందరికీ అందుబాటులో ఉండాలని, క్లా బ్యాక్ విధానానికి వ్యతిరేకంతోపాటు ఏజెంట్ల భవిష్యత్ రక్షణ తదితర ముఖ్యమైన డిమాండ్లను పరిష్కరించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఆల్ ఇండియా ఏజెంట్ల సమాఖ్య అధ్యక్షుడు శ్యామల్ చక్రవర్తి, లియాఫీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం లియాఫీ అధ్యక్ష, కార్యదర్శులు గుడికందుల రవి, కటకం సతీశ్‌తోపాటు ఏజెంట్లు అంబాల బాబు, జనగామ సదయ్య, చింతల శ్రీనివాస్, బూర్ల దామోదర్, అచ్చ వేణు, శనిగరపు రమేశ్, రవి, రమేశ్, రుషేంద్రం, బుచ్చిరాజం, పోతుల నగేశ్, ఇ.కనకయ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా రాజన్న రథోత్సవం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శివకల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. సుందరంగా అలంకరించిన పెద్దసేవలపై ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అర్చకులతో కలిసి పెద్దసేవలను మోశారు. శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు దారిపొడవునా నృత్యాలు చేశారు. ప్రధాన ఆలయం నుంచి శ్రీవేణుగోపాలస్వామి గుడి వద్దకు వచ్చి తిరిగి ప్రధానాలయానికి చేరుకుంది. ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి పేరుతో రుణాలు



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

- ఒకరు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చోళ మండల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపని లిమిటెడ్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు చనిపోయిన వారి పేరుతో సుమారు రూ.కోటి 39 లక్షల 90 వేల రుణం తీసుకుని మోసానికి పాల్పడ్డారని ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కంపనీ హెడ్ ఆఫీస్ జోనల్ లీగల్ మేనేజర్ పీ.గగన్‌దీప్ అగర్వాల్ గత జనవరి 9న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరిపించగా అందులో పని చేసే సిబ్బందే మోసాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్ చల్ల ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్ ఏరియాలో ఏసీఎంగా పని చేసిన చిట్టేటి అశోక్‌రెడ్డి పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడ్డారన్నారు. కాగా బుధవారం ప్రవీణ్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అశోక్‌రెడ్డి పరారీలో ఉన్నాడన్నారు. చెన్నూర్ మండలం కత్తెరశాల, కిష్టపేట గ్రామాలకు చెందిన మృతులు చేతెల్లి సమ్మయ్య పేరుతో రూ.25.90 లక్షలు, చల్ల రామయ్య పేరుతో రూ.20 లక్షలు, చేతెల్లి చిన్న బక్కయ్య పేరుతో రూ.20 లక్షలు, దోమల సారమ్మ పేరుతో రూ.24 లక్షలు, చల్ల రవీందర్ పేరుతో రూ.25 లక్షలు, బొజ్జ మల్లయ్య పేరుతో రూ.25 లక్షలు తీసుకుని సొంతానికి వాడుకున్నారన్నారు. ఈ కేసులో ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డికి మరి కొంతమంది సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలో వారిని సైతం అరెస్ట్ చేస్తామన్నారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ..

- ఖాతాలోంచి రూ.56వేలు మాయం



రామకృష్ణాపూర్: టికెట్ క్యాన్సిల్ ఎలా చేయాలని కష్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతకడమే అతను చేసిన తప్పు. ఓ లింక్ పంపిస్తామని దాని ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అవతలి వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి యాప్ డౌన్‌లోడ్ చేశాడు. ఇంకేముంది అకౌంట్‌లో నుంచి రూ.56వేలు పోగొట్టుకున్నాడు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఏజోన్ ఏరియాకు చెందిన సదానందం ఇటీవల తత్కాల్ ద్వారా బుక్ చేసిన రైల్వే టికెట్‌ను క్యాన్సిల్ ఎలా చేయాలని గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికాడు. అందులో లభించిన ఓ నంబర్‌కు ఫోన్ చేయడంతో అవతలి వ్యక్తి పలు సూచనలు చేశాడు. టికెట్ క్యాన్సిల్ కోసం తాము సహాయం చేస్తామని, ముందుగా తాము పంపిన లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. అనంతరం ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసి తన బ్యాంకు ఖాతా చూసుకోమని చెప్పగా అందులో నుండి రూ.56 వేలు మాయమయ్యాయి. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు, ఆభరణాలు షాపుల్లో ఉంచొద్దు

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: షాపులు, మాల్స్‌లో భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు నిల్వ ఉంచవద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దొంగలు టెక్నాలజీని వాడి చోరీలకు పాల్పడుతున్నారని, షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు రోజుల క్రితం దస్నాపూర్‌లోని నేషనల్ మార్ట్‌లో జరిగిన చోరీకి కటింగ్ గ్రైండర్ ఉపయోగించి లాకర్‌ను పగులగొట్టారన్నారు. ఆ మార్ట్ పక్కన నిచ్చెన ఉండగా, దాని సహాయంతో పైకి ఎక్కి రేకులకు ఉన్న బోల్టులు తొలగించి షాపులోనికి చొరబడినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడే ముందు సీసీ కెమెరాలో ఫుటేజీ నమోదు కాగా దాని తర్వాత కనెక్షన్ తొలగించినట్లు పేర్కొన్నారు. దొంగను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టించిన వారికి నజరానా ఇస్తామన్నారు. షాపులు, మాల్స్‌లో లాకర్‌సేఫ్ అని నమ్మవద్దని, కటర్లతో వాటిని సైతం పగులగొడుతున్నారన్నారు. షాపుల ముందు హ్యూమెన్ అలర్ట్ డిటెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగదును షాపులో ఉంచకుండా ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేయాలన్నారు. టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగకు సంబంధించిన చిత్రాన్ని విడుదల చేశారు.

భర్త చేతిలో భార్య హతం



నిరోజ(ఫైల్)

ఖానాపూర్: భర్త చేతిలో భార్య హతమైన సంఘటన మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లా పెంబి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఖానాపూర్ సీఐ సీహెచ్ అశోక్ తెలిపిన ప్రకారం.. ఖానాపూర్ మండలంలోని బావాపూర్(ఆర్) తండాకు చెందిన లావుడ్య అర్జున్‌కు గోసంపల్లె గ్రామానికి చెందిన నిరోజ(25)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించిన అర్జున్ భార్య నిరోజను కొట్టడంతో మృతిచెందింది. బుధవారం ఉదయం మృతి విషయం తెలిసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. ఘటన స్థలాన్ని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనన్ సందర్శించారు. ఆయన వెంట పెంబి ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

లక్ష్య సాధనలో దూసుకెళ్తున్న గనులు

- గడువుకు ముందే అధిగమించిన ఏడు గనులు



సింగరేణి ఓసీపీ

గోదావరిఖని: లక్ష్య సాధనలో సింగరేణి బొగ్గు గనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఉత్పత్తి సాధన కోసం అధికారులు, కార్మికులు సమష్టిగా శ్రమిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం నిర్దేశించింది. ప్రస్తుతం 98 శాతం ఉత్పత్తితో ముందుకు సాగుతోంది. సింగరేణి డైరెక్టర్లు ఏరియాల వారీగా పర్యటిస్తూ ఉత్పత్తి లక్ష్య సాధనకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రతీవారం సీ అండ్ ఎండీ బలరాం వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు.

21 భూగర్భ.. 18 ఓసీపీలు..

సింగరేణిలో 21 భూగర్భ గనులు, 18 ఓసీపీలుండగా, వీటిలో రెండు భూగర్భ గనులు, ఐదు ఓసీపీలు ఇప్పటికే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాయి. గడువుకు ముందే లక్ష్యం సాధించడంపై సీఅండ్ఎండీ అభినందించారు. వారిలో మరింత స్ఫూర్తి నింపేందుకు అన్నిగనులపై పర్యటించి మనోధైర్యాన్ని కల్పించారు. సంస్థ భవిష్యత్ కోసం ప్రతీఒక్కరు పనితీరు మెరుగుపర్చుకోవడంతోపాటు ఉత్పత్తి లక్ష్యం పెంచాలని, ఇదే సమయంలో రక్షణపై దృష్టి సారించాలని సూచించారు.

ఓసీపీలపైనే ప్రధాన దృష్టి..

ఓసీపీలపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. మొత్తం 70శాతం బొగ్గు ఉత్పత్తి ఓసీపీలపైనే ఆధారపడి ఉంది. ఈక్రమంలో సంస్థ సీఎండీతోపాటు డైరెక్టర్లు ఓసీపీల్లో ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తి, తీసిన బొగ్గు రవాణా చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్రతీషిఫ్టు, రోజువారీ ఉత్పత్తి లక్ష్యం జాబితాను ఎప్పటికప్పుడు తెప్పించుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉత్పత్తి తగ్గినా, రవాణా ఆగినా వెంటనే ఉన్నతాధికారులు లైన్‌లోకి వచ్చి వివరణ అడుతున్నారు. ఈ మార్చితో వార్షిక లక్ష్యం గడువు ముగుస్తుంది. దీంతో అధికారులు, ఉద్యోగులు ప్రతీక్షణం అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగుతున్నారు.

లక్ష్యం సాధించిన రెండు భూగర్భగనులు

ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు భూగర్భ గనులు వార్షిక లక్ష్యం సాధించాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ 23 రోజుల ముందుగా, ఆర్కే–6గని 20రోజుల ముందుగా లక్ష్యం సాధించి అగ్రగామిగా నిలిచాయి. మిగతా గనులు కూడా లక్ష్యాల సాధనలో పోటీ పడుతున్నాయి.

ఐదు ఓసీలు కూడా..

ఐదు ఓసీపీలు వార్షిక లక్ష్యాన్ని నిర్దేశిత గడువుకు ముందుగానే సాధించాయి. కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసీ 23రోజుల ముందుగా, శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ–2 ఓసీ 24 రోజుల ముందుగా, 21 రోజుల ముందుగా మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–4, ఆర్జీ–3లోని ఓసీపీ–2.. 20రోజుల ముందుగా, ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ 16రోజుల ముందుగా లక్ష్యం పూర్తి చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నాయి.

నిర్దేశిత వార్షిక లక్ష్యం సాధించిన గనులు

ఏరియా	గని	లక్ష్యం సాధించిన తేదీ
శ్రీరాంపూర్	ఆర్కేనూటెక్(భూగర్భ గని)	మార్చి 03
శ్రీరాంపూర్	ఆర్కే–6(భూగర్భ గని)	మార్చి 11
కొత్తగూడెం	కిష్టారం ఓసీపీ	ఫిబ్రవరి 08
శ్రీరాంపూర్	శ్రీరాంపూర్ ఓసీ–2	మార్చి 07
మణుగూరు	పీకే ఓసీపీ–4	మార్చి 10
ఆర్జీ–3	ఓసీపీ–2	మార్చి 11
ఆర్జీ–1	జీడీకే–5 ఓసీ	మార్చి 15

ఇదే స్ఫూర్తితో ముందుకు..



వార్షిక లక్ష్యాన్ని సాధించిన గనులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా గనులు కూడా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలి. బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన రెండు భూగర్భగనులు, ఐదు ఓసీపీల ఉద్యోగులు, గని అధికారులను అభినందిస్తున్నా.

– బలరాం, సింగరేణి, సీఎండీ

బడ్జెట్ పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- భూభారతికి చట్టబద్ధత తేవాలి
- ఎస్సీ, బీసీ బిల్లుల ఆమోదం హర్షణీయం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని, దానిని పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సిరిసిల్ల కార్మిక భవనంలో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఆశలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్నం భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలివ్వాలని కోరారు. అన్ని శాఖల్లోని చిరు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతులు తొలగించాలని కోరారు. ఎస్సీ, బీసీ బిల్లుల ఆమోదం హర్షణీయమన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు అందివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోయిన అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కుర్ర రాకేశ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శ్యాంసుందర్‌రెడ్డి చిట్టీల వ్యాపారంలో జమ్మికుంట మండలం పాపయ్యపల్లెకు చెందిన రాపెల్లి కుమారస్వామికి ఆయన డబ్బు ఇవ్వకుండా సతాయిస్తున్నారు. దీంతో గత జనవరి 20వ తేదీన జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా, చిట్టీల డబ్బు సమస్య తేలకపోవడంతో బాధితుడు అదేనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సైతం ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం ఈనెల 12వ తేదీన తారుపెల్లి హెచ్‌ఎం శ్యాంసుందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నీటి గోస తీర్చండి

- అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకున్న నుంగాపూర్ గ్రామస్తులు
- 'సాక్షి' కథనంతో కదిలిన యంత్రాంగం

సాక్షి స్పందన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్

నార్నూర్: 'నీళ్ల కోసం ఇంకెంత కాలం తిప్పలు పడాలే.. గొంతు తడువాలంటే బిందెలు పట్టుకుని కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తుంది.. ఏండ్లు గడుస్తున్నా మా గోస తీరట్లే.. ఈ సమస్యతో మా ఊరి పిలగాండ్లకు పిల్లను కూడా ఇస్తలేరు.. పశువులను కూడా వేరే చోటుకు తీసుకెళ్లాల్సి వస్తోంది..' అంటూ ఆ గ్రామానికి విచ్చేసిన అధికారుల ఎదుట ఆదివాసీలు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని నుంగాపూర్ గోండుగూడలో తాగునీటి ఇక్కట్లపై 'గుక్కెడు నీటికి అరిగోస' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు ఉదయాన్నే గ్రామానికి చేరుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీవో సాయిప్రసాద్ స్థానికులతో మాట్లాడి నీటి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఇబ్బందులను వివరించారు. ఉన్నతాధికారులు వచ్చి శాశ్వత పరిష్కారం చూపేంత వరకు వారిని కదలనీయబోమని అక్కడే కుర్చొని నిరసన తెలిపారు. విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, ప్రతి పాదనలు సైతం పంపామని, వారం రోజుల్లో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని గ్రామస్తులకు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వాలని స్థానికులు పట్టుబట్టారు. ఈ మేరకు అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈతో సెల్‌ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన నచ్చజెప్పడంతో వారు శాంతించారు. విషయం తెలుసుకున్న సీఐ రహీం పాషా గోండుగూడను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. శాంతియుత మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో స్థానికులు మాడవి లచ్చు పటేల్, కనక తెలంగాణారావు, కొడప లింగు, పెందూర్ లక్ష్మణ్, భీంరావ్ తదితరులున్నారు.

ఆస్పత్రి భవనం ప్రారంభమెప్పుడో..!

- రూ.8.50 కోట్లతో నిర్మాణం
- టెండరు దశలోనే మార్చురీ గది



ప్రభుత్వాసుపత్రి పక్కా భవనం

లక్సెట్టిపేట(మంచిర్యాల): 2023 ఏప్రిల్‌లో రూ.8.50 కోట్ల నిధులతో మండల కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో చేపట్టిన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అప్పటి మంత్రి హరీష్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల ప్రజల కోసం 30 పడకలతో ఆస్పత్రి పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభిస్తామని అధికారులు నిర్ణయించినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆసుపత్రిని పాత ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. అరకొర సౌకర్యాలతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

టెండరు దశలోనే మార్చురీ గది నిర్మాణం

ఆస్పత్రిలో రెండంతస్తులతో 20 గదులు, ఓటీ, క్యాజువాలిటీ గది, మేల్, ఫీమేల్ వార్డులు, లేబర్ రూం, ఎక్స్‌రే, శానిటేషన్, అన్ని ఏర్పాట్లతో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం, పైప్‌లైన్‌ల పనులు పూర్తి చేశారు. కానీ మార్చురీ గది నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఇటీవల ఆసుపత్రిని పరిశీలించి అధికారులతో మాట్లాడి ఆరోగ్య శాఖ నుంచి రూ. కోటి 60 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈనెల 27 వరకు ఆన్‌లైన్ టెండరు ప్రక్రియ పూర్తి కానుంది. స్థల పరిశీలన జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ఇటీవల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

త్వరగా పూర్తి చేయాలి



ఆస్పత్రి భవనం పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. మిగతా పనులను అధికారులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. ప్రస్తుత ఆస్పత్రి భవనం రేకుల షెడ్డు కావడంతో ఇబ్బంది అవుతుంది. మార్చురీ లేకపోతే పోస్టుమార్టం చేసేందుకు ఇబ్బంది అవుతుంది. అన్ని పనులు పూర్తి చేసి త్వరగా ప్రారంభించాలి.

– శ్రీనివాస్ ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట